సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 6 । మే । 2023



వైభవంగా రథోత్సవం

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో శ్రీవేణుగోపాలస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.



రాజన్న సేవలో ఎమ్మెల్సీ

వేములవాడ: రాజన్నను శుక్రవారం ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

9న రాజన్న హుండీ ఆదాయం లెక్కింపు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు ఈనెల 9న ఉదయం 8 గంటల నుంచి స్వామి వారి ఓపెన్ స్లాబ్‌లో లెక్కించనున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది సకాలంలో హుండీ లెక్కింపులో పాల్గొనాలని ఆదేశించారు.

ధాన్యం తడిసిందని లారీ నుంచి దించేశారు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం లారీ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్లాపూర్ కొనుగోలు కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో వరిధాన్యం తడిసింది. కేంద్రం పరిసరాల్లో పలు చోట్ల నీరు నిలిచింది. కొందరు రైతుల ధాన్యం కాంటా పెట్టిన అనంతరం లారీలో లోడ్ చేశారు. అప్పుడు వర్షం కురియడంతో ధాన్యం తడిసిందని, లారీలోని ధాన్యం దించేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లోడ్ చేసిన ధాన్యం అన్‌లోడ్ చేయడం సరికాదని వాపోయారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: ఇటీవల కురిసిన వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ, జిల్లాలో అకాల వర్షాలతో చేతికొచ్చిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులు చాలా నష్టపోయారని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కేంద్రాల్లో తరుగు పేరిట క్వింటాల్‌కు 7కిలోల వరకు రైతులను దోపిడీ చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వ మద్దతు ధరకంటే తక్కువ చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నారని వీటిపై దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పంతం రవి, రమేశ్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

4,045 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటి వెలుగులో శుక్రవారం 4,045 మందికి కంటి పరీక్షలు చేశారు. 962 మందికి రీడింగ్ గ్లాసులు, 600 మందికి పాయింట్ గ్లాస్ అద్దాలు అందించారు. జిల్లాలో 26 ప్రాంతాల్లో నిర్వహించిన కంటి వెలుగులో 234 మంది సిబ్బంది పాల్గొన్నట్లు జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు తెలిపారు.



'దిగాలుగా చూస్తున్న ఇతని పేరు దేశవేణి భూమేశ్. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన భూమేశ్ మూడు ఎకరాల్లో వరి పంటను వేశాడు. కోతకు వచ్చిన పొలంపై రాళ్ల వాన పడడంతో వడ్లు అన్నీ రాలిపోయాయి. వరిగింజలు లేని పొలంలో ఇలా ఫొటో దిగి వ్యవసాయ అధికారులకు అందిస్తే.. పంట నష్టపరిహారం కోసం భూమేశ్ పేరును వ్యవసాయశాఖ సిఫార్సు చేస్తుంది.'

'ఇది రుద్రంగి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన వడ్లు. ఏప్రిల్ 28న కురిసిన వర్షాలకు ఆరబోసిన వడ్లు వరద పాలయ్యాయి. జిల్లా వ్యవసాయ అధికారులు చేస్తున్న సర్వేల్లోకి కొట్టుకుపోయిన ఈ ధాన్యం లెక్కలు నమోదు చేయడం సాధ్యం కావడం లేదు. ఒక్క రుద్రంగిలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లోనూ ఇలాగే ఆరబోసిన వడ్లు తడి ముద్దయి మొలకెత్తాయి. ఆ వడ్లు, బాధిత రైతుల ఫొటోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు.'



పంట నష్టం.. 'లెక్క' కష్టం..!

- దెబ్బతిన్న పంట ఫొటోలతో లింకు
- ప్రాథమిక అంచనాలు 19 వేల ఎకరాలు
- క్షేత్ర సర్వేల్లో 14,101 ఎకరాలు
- జిల్లాలో సిద్ధమైన నివేదిక

'ఇది వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలో వ్యవసాయ అధికారిణి రైతు వరి పొలంలో సర్వే తీరు. నష్టపోయిన పంటను చూసి రైతులతో సహా జీపీఎస్ మ్యాప్‌తో అక్షాంశ, రేఖాంశాలతో లొకేషన్ మ్యాప్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తుంది. ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి ఇలా ఫొటోలు తీయడం, లేదా రైతులనే ఫొటోలు పంపాలని కోరుతున్నారు.'



సిరిసిల్ల: జిల్లాలో వారం రోజుల పాటు రాళ్ల వానలు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఏప్రిల్ 19న జిల్లా వ్యాప్తంగా రాళ్ల వాన పడింది. మళ్లీ వరుసగా ఏప్రిల్ 24, 25, 27, 30వ తేదీల్లో జిల్లా అంతటా వరుసగా ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానలు కురిశాయి. అంతకు ముందు మార్చి 19న రాళ్ల వానలు పడ్డాయి. ఇలా జిల్లాలో ప్రకృతి కోపానికి పంటలు పాడయ్యాయి. తొలుత పాడైన పంట వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేసి జిల్లాలో 19వేల ఎకరాల్లో 17వేల మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కానీ క్షేత్రస్థాయిలో సర్వే చేయగా ఇప్పుడు 14,101 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లుగా నిర్ధారించారు. మరోసారి రైతుల ఫొటోలు, దెబ్బతిన్న పంటల వివరాలను ఆన్‌లైన్ చేయడంతో పంట నష్టాలను మరింత తగ్గించారు. ఇలా జిల్లాలో పంట నష్టాలు అంచనాలకు అందడం లేదు. పక్కాగా లెక్కలు చిక్కడం లేదు.

నివేదిక జాప్యం.. కలెక్టర్ ఆగ్రహం..

జిల్లాలో పంటనష్టాలపై క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వడంలో జాప్యం జరిగింది. దీంతో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మే 2న జిల్లా వ్యవసాయ అధికారి రణధీర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారిగా వేములవాడ ఏడీఏ భాస్కర్‌కు బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో రైతుల ఫొటోలతో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేయడం వ్యవసాయ అధికారులకు ఇబ్బందిగా మారింది.

సిబ్బంది కొరతతో ఇబ్బంది

జిల్లాలోని ఇల్లంతకుంట వ్యవసాయ అధికారి తిరుపతి మరణించడంతో ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. ఆయనే ఇన్‌చార్జిగా ఉన్న సిరిసిల్ల మండల ఏవో పోస్టు కూడా ఖాళీగా ఉంది. గంభీరావుపేట, రుద్రంగి, వేములవాడ రూరల్ వ్యవసాయ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 13 మండలాల్లో ఐదు పోస్టులు ఖాళీగా ఉండగా.. 8 మంది ఏవోలు పని చేస్తున్నారు. 57 మంది ఏఈవోలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 12 ఖాళీలు ఉన్నాయి. సిబ్బంది కొరతతో క్షేత్రస్థాయి సర్వేలు కష్టంగా మారింది.

మంత్రి కేటీఆర్ హామీతో ఆశలు

జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. మే 2న జిల్లాకు వచ్చిన మంత్రి 4 మండలాల్లో దెబ్బతిన్న పంటలను చూసి ప్రభుత్వ పరంగా ఈ ప్రకటన చేశారు. దీంతో రైతుల్లో నష్ట పరిహారంపై ఆశలు చిగురించాయి. కానీ క్షేత్రస్థాయి నివేదికలు, పక్కాగా లెక్కలు అందించడం వ్యవసాయ అధికారులకు ఇబ్బందిగా మారింది. ఏది ఏమైనా ప్రభుత్వం అందించే ఆర్థికసాయం కోసం జిల్లా రైతాంగం నిరీక్షిస్తోంది.

జిల్లాలో పంట నష్టాలు ఏప్రిల్ నెలలో తేదీల వారీగా(ఎకరాల్లో)

మండలం పేరు	24న	25న	27న	30న	మొత్తం
ఎల్లారెడ్డిపేట	0	3,704	0	0	3,704
వీర్నపల్లి	148	2,832	0	0	2,980
గంభీరావుపేట	69	1,007	0	305	1,381
ముస్తాబాద్	0	60	220	340	620
సిరిసిల్ల	0	241	0	0	241
తంగళ్లపల్లి	24	20	20	150	214
ఇల్లంతకుంట	141.3	0	0	0	141.3
చందుర్తి	0	650	0	2,540	3,190
కోనరావుపేట	55	595	0	0	650
వేములవాడ	765	400	300	1,350	2,815

తుది నివేదిక సిద్ధమవుతోంది



జిల్లాలో పంట నష్టాల తుది జాబితా సిద్ధమవుతుంది. ప్రాథమిక అంచనాలు కొంచం ఎక్కువగానే ఉంటుంది. క్షేత్రస్థాయి సర్వేలు, శాస్త్రీయ కోణంలో విశ్లేషిస్తే వాస్తవ నష్టాలు తెలుస్తాయి. పంట నష్టాల సర్వేలు పూర్తి అయ్యాయి. ప్రభుత్వానికి తుది నివేదిక అందిస్తాం.

– వి.భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి



గుండెలవిసేల రోదిస్తున్న అనిల్ భార్య సౌజన్య

నిన్నే చూసుకుని

ధైర్యంగా ఉన్నాము అయ్యా

- మిన్నంటిన అనిల్ కుటుంబీకుల రోదనలు
- శోకసంద్రంలో మల్కాపూర్
- నేడు స్వగ్రామానికి పార్థివదేహం
- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



కుటుంబీకులు, బంధువుల రోదనలు



దీనంగా చూస్తున్న అనిల్ కుమారులు



ఓదార్చుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): 'ఇన్ని రోజులు నిన్నే చూసుకుని ధైర్యంగా ఉన్నాము అయ్యా.. నీవు లేవన్న విషయం తెలిసి మాకు ధైర్యం అత్త లేదు అయ్యా'.. అంటూ శుక్రవారం అనిల్ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. జమ్ముకాశ్మీర్‌లో హెలికాప్టర్ ప్రమాద ఘటనలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పబ్బాల అనిల్ (29) మృతి మండలంలో విషాదం నింపింది. కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తుల వేదనలు, రోదనలతో గ్రామం శోకసంద్రమైంది. పది రోజుల క్రితం కళ్ల ముందు తిరిగిన అనిల్ ఇక లేడని అతడి భార్య సౌజన్య రోదనలు మిన్నంటాయి. నాన్న లేడని అందరూ అంటుంటే చిన్నారులు బేల మొహంతో దీనంగా చూడడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. అనారోగ్యంతో ఉన్న తండ్రి మల్లయ్య కొడుకు లేడని తెలిసి బాధలో పడిపోయాడు. జమ్మూలో డ్యూటీ మరో రెండు నెలల్లో పూర్తి అవుతుందని, ఆ తర్వాత సేఫ్ జోన్‌లో ఉంటానని, చిన్న పిల్లలు ఉన్నారని, దగ్గరగా బదిలీ జరిగేలా ప్రయత్నిస్తానని ఇటీవల తమ్ముడు అనిల్ ఇంటికి వచ్చినపుడు తెలిపాడని అతని సోదరులు చెప్పారు. కాగా అనిల్ పార్థివదేహం శనివారం ఉదయం స్వగ్రామం మల్కాపూర్‌కు రానుంది. ఆర్మీ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా అనిల్ కుటుంబాన్ని శుక్రవారం రాత్రి వేములవాడ ఆర్డీఓ పవన్‌కుమార్ పరామర్శించారు. అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశం రూట్ మ్యాప్ పరిశీలించారు.

జవాన్ అనిల్ మృతి తీరని లోటు

జవాన్ అనిల్ మృతి తీరని లోటని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనిల్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు ఉన్నారు.


కిటకిటలాడిన రాజన్న క్షేత్రం

వేములవాడ: రాజన్నను శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానం చేసిన భక్తులు తడి బట్టలతో రాజన్నకు అభిషేకం, అన్నపూజ, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు.



పదోన్నతుల 'పంచాయితీ'

- పంచాయతీ రాజ్ విభాగంలో వింత పరిస్థితి
- పదోన్నతి కోసం 84 మంది జూనియర్ అసిస్టెంట్ల ఎదురుచూపులు
- గతేడాది డిసెంబర్‌లోనే సీనియారిటీకి అర్హత
- ఆరునెలలుగా కాలయాపన చేస్తున్న అధికారులు



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం కరీంనగర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడిజిల్లాలో ప్రస్తుతం పదోన్నతుల పంచాయితీ నడుస్తోంది. పంచాయతీరాజ్ విభాగంలో రెండేళ్ల కింద చేరిన జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతికి అర్హత సాధించి దాదాపు ఆరునెలలు కావస్తున్నా.. వారికి ప్రమోషన్ రావడం లేదు. సర్వీస్ రూల్స్ ప్రకారం.. తమకు పదోన్నతి రాకుండా ఉన్నతాధికారులు ఆపేస్తున్నారని జూనియర్ అసిస్టెంట్లు ఆరోపిస్తుండగా.. అందరికీ ఒకేసారి ఇద్దామన్న ఆలోచనతో ఉన్నామంటూ ఉన్నతాధికారులు తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. దీంతో ఈ వివాదం క్రమంగా చినికి చినికి గాలివానగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తమ పదోన్నతులను కావాలనే ఆపుతున్నారన్న భావన ప్రతీ జూనియర్ అసిస్టెంట్లలో క్రమంగా నాటుకుపోతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లు తమ ఉన్నతాధికారులతో పలుచోట్ల ఘర్షణలకు దిగుతున్నారు.

అసలేం జరిగింది?

2018 జూన్‌లో టీఎస్‌పీఎస్‌సీ ద్వారా దాదాపు 1500లకుపైగా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల అయింది. అందులో దాదాపు 160 వరకు పంచాయతీరాజ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఉన్నాయి. అదే ఏడాది ఆగస్టులో అభ్యర్థులంతా టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన పరీక్ష రాశారు. 2020 అక్టోబరులో పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. అదే ఏడాది డిసెంబరులో వీరంతా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లుగా పంచాయతీరాజ్ కార్యాలయాల్లో విధుల్లో చేరారు. ఇందులో వరంగల్ రీజియన్ (కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్)లో దాదాపుగా 84 మందికిపైగా ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 20 మందికిపైగా పనిచేస్తున్నారు. వాస్తవానికి వీరికి గత డిసెంబరులో సర్వీసు రూల్స్ ప్రకారం.. సీనియర్ అసిస్టెంట్ లేదా యూడీసీగా పదోన్నతి రావాలి. కానీ.. అధికారులు ఆ ఫైళ్లను తమ వద్దే పెట్టుకున్నారు. ఆరునెలలుగా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు.

కారణాలివే..?

ఈ విషయంలో ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాలతోపాటు మిగిలిన పాత ఖమ్మం ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలోనూ జూనియర్ అసిస్టెంట్లు తీవ్ర ఆవేదనలో కూరుకుపోయారు. ఇదే విషయమై తమ ఉన్నతాధికారులతో వాదోపవాదాలకు దిగుతున్నారు. దీంతో కొందరు డిప్యుటేషన్ కోసం ప్రయతిస్తున్నారు. మరికొందరు తమ పదోన్నతులు ఆపారంటూ కొందరు మంత్రులకు మొరపెట్టుకుంటున్నారు. దీనికి అధికారులు ఏం చెబుతున్నారంటే.. ఇటీవల గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల నేపథ్యంలో కొందరు, గర్భం దాల్చిన కారణంగా కొందరు మహిళా సిబ్బంది రెండు నుంచి ఆరునెలల వరకు అధికారికంగా లీవు పెట్టారు. కొన్ని నెలల పాటు సర్వీసులో వెనకబడిన కారణంగా తాము మిగిలిన వారికి పదోన్నతులు ఇవ్వలేకపోతున్నామని, అందరికీ రెండేళ్లునిండిన వెంటనే పదోన్నతులు ఇస్తామని అధికారులు జూనియర్ అసిస్టెంట్లకు వివరణ ఇస్తున్నారు. అయితే.. వీరంతా డిసెంబరు నాటికి విధుల్లో చేరిపోయారు. ఈ లెక్కన ఇప్పటికే ఆరు నెలలు కావస్తోంది. అధికారులు చెప్పిన ప్రకారం.. ఇప్పుడు అందరికి రెండేళ్ల సర్వీసు నిండినట్లే. అయినా.. ఎందుకు ఇవ్వడం లేదని జూనియర్ అసిస్టెంట్లు మదనపడిపోతున్నారు. అధికారులు సర్వీసు రూల్స్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

క్రమబద్ధీకరణలో 'సహకారం'!

- సిబ్బంది నుంచి దాదాపు రూ.1.18 కోట్ల వసూలు
- రెండు దశాబ్దాల కల కోసం కప్పం కట్టిన ఉద్యోగులు
- సచివాలయానికి చేరిన మామూళ్ల పర్వం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఇటీవల ఉమ్మడి జిల్లా కరీంనగర్ జిల్లాలో ఓ శాఖలో ఉద్యోగుల క్రమబద్ధీకరణలో భారీగా డబ్బులు చేతులు మారాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఉదంతం కలకలం రేపుతోంది. ఉద్యోగుల క్రమబద్ధీకరణ పేరిట జరిగిన ఈ వసూళ్ల పర్వం విలువ దాదాపు రూ.2 కోట్లకు చేరడంతో సదరు ప్రభుత్వశాఖలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. సదరుశాఖలో ఇటీవల దాదాపు 591పోస్టులు రెగ్యులరైజ్ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ మరో రెండు రకాల పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగులంతా దాదాపు 20ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. చాలాకాలంగా ఎదురుచూస్తున్న క్రమబద్ధీకరణకు ఇటీవల అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

సంబరాన్ని సొమ్ము చేసుకున్నారు

ఈ విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఉద్యోగులకు ముందే సమాచారం అందింది. దాదాపుగా రెండు దశాబ్దాలుగా కొలువుల క్రమబద్ధీకరణకు తమ నిరీక్షణ ఫలించడంతో అంతా కలిసి సంబరాలు చేసుకున్నారు. జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలపరిధిలో మొత్తం 591 ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అంతా సిద్ధమైంది. సరిగ్గా అప్పుడే.. ఉన్నతాధికారుల అనుచరులు రంగంలోకి దిగారు. 591 కుటుంబాలకు ఈ నిర్ణయం మేలు చేస్తుందని, కాబట్టి ఉన్నతాధికారులకు ప్రతీ ఉద్యోగికి రూ.20వేల చొప్పున మామూళ్లు ఇవ్వాల్సిందేనని సందేశం పంపారు. 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిర్ణయం అమలు కానుందన్న ఆనందంలో చాలామంది ఉద్యోగులు అప్పోసప్పో చేసి అనుచరులు అడిగినకాడికి సమర్పించుకున్నారు. రూ.1.18 కోట్ల వసూలు చేశారు.

ఆగమేఘాల మీద ప్రొసీడింగ్స్

సదరుశాఖలో వసూళ్ల పర్వం పూర్తికాగానే క్రమబద్ధీకరణ పర్వం మొదలైంది. మొత్తం 591 ఉద్యోగాలకు క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్‌తోపాటు, తీర్మానాలు అవసరం. ఇక్కడే అనుచరులు చక్రం తిప్పారు. తీర్మానాల విషయంలో వయసు పైబడిన వాళ్లు, ఇతర అనర్హతలు కలిగిన వారి వద్ద రూ.50వేలకు పైగానే వసూలు చేశారని సమాచారం. తరువాత ఆగమేఘాల మీద 591 మందికి రెగ్యులరైజేషన్ జరిగిపోయింది. వసూళ్ల పర్వం సదరుశాఖలో చర్చనీయాంశంగా మారడంతో ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా హైదరాబాద్‌లోని సచివాలయానికి చేరింది. సదరు విభాగంలో ఉన్నతాధికారి ఈ మొత్తం వ్యవహారంలో సూత్రధారిగా వ్యవహరించారని తెలిసింది. సదరుశాఖ కమిషనర్‌కు విషయం తెలిసి విచారణకు ఆదేశించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.

'టీఎస్‌ఆర్‌జేసీ' సజావుగా నిర్వహించాలి

కరీంనగర్: ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశంకోసం శనివారం 'టీఎస్‌ఆర్‌జేసీ' కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ (శిక్షణ) నవీన్ నికోలస్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30వరకు పరీక్ష ఉంటుందని, ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు 7,081 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు 30 కేంద్రాల్లో 30మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 5 రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కో–ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, డీఈవో జనార్దన్‌రావు, సూపరింటెండెంట్ స్వామి పాల్గొన్నారు.

రామకృష్ణ హౌస్ అరెస్ట్



వేములవాడ: కాంగ్రెస్ జిల్లా కార్యాలయాల ఎదుట శుక్రవారం తలపెట్టిన హనుమాన్ చాలీసా చదివే కార్యక్రమానికి సిద్ధమైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్‌ను పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు.

క్లుప్తంగా

ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రెండు దశాబ్దాలుగా ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న లెక్చరర్ల కల ఫలించింది. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన మేరకు టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన సుమారు తొమ్మిదిఏళ్లకు ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణకు పచ్చజెండా ఊపింది. ఉమ్మడిజిల్లాలో 58ప్రభుత్వ కళాశాలల్లో 514 మంది కల ఫలించింది. శుక్రవారం ఆకస్మికంగా కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని అన్నిజిల్లాల్లోని డీఐఈవోలను ప్రభుత్వం ఆదేశించింది. ఫలితంగా ఆయా కార్యాలయాల నుంచి అందిన సమాచారం మేరకు తమ ఉత్తర్వులను అందుకునేందుకు కాంట్రాక్ట్ లెక్చరర్లు డీఐఈవో ఆఫీసుల ఎదుట సందడి చేశారు. అధికారిక ఉత్తర్వులు అందుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : మండలంలోని వెంకటాపూర్‌లోని బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడకు చెందిన శీలం శ్రీనివాస్ (38) ఎల్లారెడ్డిపేటలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపుకు వెళ్లే ఆర్టీసీ బస్సు శ్రీనివాస్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కాగా 108లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిద్ర మత్తులోనే బస్సు డ్రైవర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు ప్రయాణికులు తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ పేర్కొన్నారు.

ఇరాక్‌లో గోపాలరావుపల్లె వాసి మృతి



పర్శరాములు మృతదేహం

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని గోపాలరావుపల్లె గ్రామానికి చెందిన జనగం పర్శరాములు (52) ఇరాక్‌లో గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... పర్శరాములు కుటుంబ పోషణ నిమిత్తం కొద్దిరోజుల క్రితం ఇరాక్ దేశానికి వెళ్లగా అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య పుష్పలత, కుమారుడు కల్యాన్ ఉండగా పుష్పలత కూలీ పనిచేస్తోంది. కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. పర్శరాములు మృతితో స్వగ్రామంలో విషాదం నెలకొంది. మండల బీఆర్ఎస్ నాయకులు విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఇరాక్ దేశం ఖుర్దిస్తాన్‌లోని ఇండియన్ కాన్సులేట్ జనరల్‌కు లేఖ రాశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు.

సమ్మర్ క్యాంప్ సక్సెస్..

- 'గురుకుల' విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాసం, యంగ్ జర్నలిజంపై ప్రత్యేక శిక్షణ
- ఆసక్తిగా పాల్గొన్న చిన్నారులు



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సిరిసిల్ల: పిల్లలకు చదువుతోపాటు సమాజం, ఇతర అంశాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు ప్రత్యేక సమ్మర్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో ఏప్రిల్ 22న మొదలైన శిబిరం మే 6న ముగియనుంది. జిల్లాలోని సోషల్ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ గురుకులాల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్ సక్సెస్ అయింది. శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, యాంకరింగ్ నైపుణ్యం, ఉపన్యాసం, యంగ్ జర్నలిజం, నృత్యం వంటి అంశాల్లో ఆయారంగాల నిపుణులతో శిక్షణ ఇచ్చారు.

ఆసక్తి ఉన్నరంగాల్లో మెళకువలు..

జిల్లాల్లోని గురుకులాల విద్యార్థులను వారి ఆసక్తిని బట్టి ఎంపిక చేశారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణను ఏర్పాటు చేశారు. ఒక్కో అంశంపై రెండుగంటల చొప్పున తరగతులు నిర్వహించారు. ఆయారంగాల్లో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని వివిధ గురుకులాల విద్యార్థులు వందమందితో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయగా వారంతా తంగళ్లపల్లి ఎస్టీ గురుకులంలో ఉండి శిక్షణ పొందారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో మెళకువలు నేర్పారు. ప్రధానంగా యంగ్ జర్నలిజంపై పిల్లలు ఆసక్తిని చూపడం విశేషం.

కొత్త విషయాలు నేర్చుకున్నాం



వేసవి సెలవుల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో కొత్త విషయాలు నేర్చుకున్నాం. తరగతిలో చెప్పే పాఠాలతో సంబంధం లేకుండా సమాజం, కమ్యూనికేషన్ స్కిల్స్, చిత్రలేఖనం, డ్యాన్స్, జర్నలిజంలో ఎన్నో విషయాలు తెలిశాయి. పదిహేను రోజులపాటు శిబిరం నిర్వహించారు.

– బి.సముద్ర, ఎల్లారెడ్డిపేట

ఆసక్తిగా పాల్గొన్నా



సమాజంలో చోటు చేసుకునే అనేక పరిణామాలపై యంగ్ జర్నలిజం ఎంతో ఆసక్తిగా ఉంది. తెలియని ఎన్నో విషయాల గురించి తెలుసుకున్నా. సామాజిక బాధ్యతలు, మీడియా ప్రభావంపై శిక్షణలో వివరించారు. తరగతి గదిలో చెప్పని ఎన్నో విషయాలపై అవగాహన కల్పించగా ఆసక్తిగా పాల్గొన్నా.

– ఎం.అక్షర, నర్మాల

ఉత్సాహంగా పాల్గొన్నారు



వేసవిలో చిన్నారులకు శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉంది. గురుకులాల విద్యార్థులకు ఈ శిక్షణతో భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినట్లు అవుతుంది. సమాజంపై మరింత బాధ్యతను పెంచేవిధంగా శిక్షణ అందించాం. ఇతర విభాగాల్లోనూ చిన్నారులు ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు.

– టీఎస్.రవీందర్, ఎండీ, కమ్యూనికేషన్స్

సిరిసిల్లలో బీజేపీ నాయకుల నిరసన



బీజేపీ నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

సిరిసిల్ల అర్బన్ : కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే భజరంగ్ దళ్‌పై నిషేధిస్తామని కాంగ్రెస్ ప్రకటన పట్ల సిరిసిల్లలో బీజేపీ నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట హనుమాన్ చాలీసా పఠించేందుకు బీజేపీ నాయకులు పయత్నించారు. అప్పటికే కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు పోలీసులు భారీగా మోహరించి బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బీజేపీ నాయకులు ఎర్రం మహేశ్, రెడ్డిబోయిన గోపితో పాటు మరికొందర్ని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

రాజకీయ లబ్ధి కోసమే...

రాజకీయ లబ్ధికోసమే బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ దేశానికి చేసేందేమి లేదని నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. కర్ణాటకలో బీజేపీని ప్రజలు వ్యతిరేకించడంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజ్, సూర దేవరాజు, కూస రవి, పలు మాండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యూత్ విభాగం నాయకులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రుద్రంగి (వేములవాడ) : మండలకేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నారవేణి గంగారాం గౌడ్‌కు చెందిన ఇంట్లో రాచర్ల రాధ మతిస్థిమితం లేని కుమారుడితో కిరాయికి ఉంటోంది. శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని రూ.55 వేల నగదుతో పాటు విలువైన సామగ్రి దగ్ధమైంది. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలనార్పారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఎస్సై ప్రభాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలుడికి తప్పిన ప్రాణాపాయం..

రాచర్ల రాధకు చెప్పుల దుకాణం ఉంది. భర్త మరణించగా ఇటీవలే దళితబంధు కింద వచ్చిన డబ్బులతో చెప్పుల దుకాణం పెట్టుకుంది. రోజూ మతిస్థిమితం లేని కుమారుడిని ఇంట్లో ఉంచి దుకాణానికి వెళ్తుంది. రోజూలాగే కుమారుడిని ఇంట్లో ఉంచి వెళ్లింది. షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమవడాన్ని స్థానికులు గమనించి బాలుడిని బయటికి తీయడంతో ప్రాణాపాయం తప్పింది. సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది.

దళితబంధును సద్వినియోగం చేసుకోవాలి

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



బొల్లారంలో దళితబంధు యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడరూరల్: దళితబంధును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని నమిలిగుండుపల్లి, హన్మాజిపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాల్లో బీరప్ప ఆలయ భూమిపూజ, దళితబంధు యూనిట్లు, చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర రాష్ట్ర ఏర్పాటు తర్వాతే పాఠ్య పుస్తకాల్లో ఉండేవిధంగా మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని అన్నారు. నమిలి గుండుపల్లిలోని రూ.12 లక్షలతో బీరప్ప ఆలయానికి భూమిపూజ చేశారు. గ్రామంలో దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. నమిలిగుండుపల్లి నుంచి వట్టెంల వరకు మిగిలిన రోడ్డు పనులను పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాలకు మొదటి విడతలో వంద దళిత యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. రెండవ విడతలో 101 యూనిట్ల మంజూరుకు రూ.110 కోట్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొస్కుల రవి, జెడ్పీటీసీ ఏశ వాణి, ఎంపీపీ బండ మల్లేశం, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలుమ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ రంగు వెంకటేశం, మల్లారం తిరుపతి, మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, సర్పంచులు సామ కవిత, సుద్దాల లచ్చయ్య, జంకె విజయ, లక్ష్మీ, వేణు, నాయకులు యామ తిరుపతి, అంజనీకుమార్, సోమినేని బాలు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



సుమిత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మెట్‌పల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన ప్రకారం..బీహర్‌కు చెందిన సుమిత్ కుమార్ (20) కూలీపని నిమిత్తం కొంతకాలం క్రితం మెట్‌పల్లికి వచ్చాడు. అధిక సంపాదన కోసం గంజాయి విక్రయించాలని భావించాడు. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయిని తీసుకువచ్చి ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలో నిఘా పెట్టి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బొమ్మెనలో మరో ఇద్దరు..

కథలాపూర్ మండలం.. బొమ్మెన గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై శ్వేత తెలిపారు. బొమ్మెనలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో తనిఖీలు చేశామన్నారు. ఇద్దరు గంజాయి విక్రయిస్తున్నట్లు తేలడంతో పట్టుకొని వారినుంచి 170 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేసులు ఎత్తివేయాలి

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమ స్థాపనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపై అక్రమంగా నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని స్తంభంపల్లి, పాశిగామ గ్రామాలకు చెందిన సుమారు 300 మంది కర్మాగారం ప్రతిపాదిత స్థలంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా పరిశ్రమ ప్రతిపాదిత స్థలంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే భూమి పూజ చేసిన స్థలంలో సుమారు మూడు గంటల పాటు నిరసన తెలిపారు. బుద్ధుని ఆనవాళ్లు ఉన్న చారిత్రక ప్రదేశాన్ని కాపాడుకోవాలని, భవిష్యత్‌లో ఈ ప్రాంతం గొప్ప పర్యాటక కేంద్రంగా విలసిల్లాలని ఆకాంక్షించారు.

వీఓఏల సమ్మె బాట..!

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్

చందుర్తి (వేములవాడ): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) శనివారం నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు. మహిళా సంఘాల బలోపేతంలో కీలకపాత్ర పోషిస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని వాపోయారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా శ్రమిస్తున్న తమకు శ్రమకు తగ్గ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ప్రభుత్వం సెర్ప్‌లో పని చేస్తున్న ఏపీఎం, సీసీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ నిర్ణయం తీసుకుందని, క్షేత్రస్థాయిలో పనిచేసే వీఓఏలను మాత్రం పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో దాదాపు 350 మంది వీఓఏలు ఉండగా.. ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండలాలకు చెందినవారు సమ్మెకు దూరంగా ఉన్నట్లు తెలిసింది.

అరకొర వేతనమే..

గ్రామాల్లో వీఓఏలు రూ.3,900 వేతనానికి విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలను, మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడం, రికవరీ చేయించడం, సామాజిక కార్యక్రమాలపై అవగాహన వంటి విధులు నిర్వహిస్తారు. ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో పని చేస్తున్నామని, తమ బతుకులు దుర్భరంగా మారాయని, డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్లు..

- సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.26వేల వరకు పెంచాలి. అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోట్ చేయాలి.
- రూ.10లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలి. గుర్తింపు కార్డులు అందజేసి, డ్రెస్‌కోడ్ అమలు చేయాలి. వ్యక్తిగత ఖాతాలోనే వేతనాలు జమచేయాలి.



నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్న వీఓఏలు

సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి



ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి. గ్రామాల్లో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాం. మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ, బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ ఆర్థికంగా బలపడేలా చూస్తున్నాం. – ఎస్.స్వరూప, వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు, చందుర్తి

ఉద్యోగ భద్రత కల్పించాలి



అరకొర వేతనాలతో దుర్భర జీవనం కొనసాగిస్తున్నాం. ఉద్యోగాలను నమ్ముకొని ఏళ్ల తరబడి పనిచేస్తున్నాం. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26వేల వేతనం ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– బి.వినోద, వీఓఏల సంఘం మండల ప్రధాన కార్యదర్శి, చందుర్తి

ఉత్తమ మార్గమే విజయానికి సోపానం

కోరుట్ల : ఉత్తమ మార్గమే విజయానికి సోపానమని నేను సైతం సమాజం కోసం స్థాపకుడు మాస్టర్ మోటివేటర్ బ్రదర్ షఫీ అన్నారు. పట్టణంలో ఈద్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన ఇహ పరలోకాల సాఫల్యం అనే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతీఒక్కరూ జీవితంలో ఎన్నో విజయాలు సాధించాలనుకుంటారన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

దొంగ అరెస్ట్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌కు చెందిన ఎగమంటి రాజు ఇటీవల ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా, దొంగలు తాళం పగలగొట్టి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా చోరీకి పాల్పడ్డ సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎండీ జహంగీర్‌ను పట్టుకుని అతడి నుంచి బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు.

చంద్రంపేటలో వాహనాలు ఢీ..

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల నుంచి కోనరావుపేట వైపు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి ఎక్సైజ్ అధికారులు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొంది. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే దురుసుగా ప్రవరించారు. నిజామాబాద్ జిల్లా.. సిరికొండ మండలం పందిమడుగుకు చెందిన మోహన్ తన కూతురిని డెలివరీ కోసం గురువారం సిరిసిల్లలోని ఓ ఆసుపత్రిలో చేర్పించాడు. శుక్రవారం స్వగ్రామానికి వెళ్తుండగా చంద్రంపేట క్రాసింగ్ వద్ద స్పీడ్‌బ్రేకర్ ఉండడంతో వేగం తగ్గించాడు. ఆ సమయంలో ఎక్సైజ్ అధికారుల వాహనం వెనుక నుంచి మోహన్ కారును ఢీకొట్టింది. దీంతో కారు వెనుకభాగం దెబ్బతింది. ఇదేంటని అబ్కారీ అధికారులు అడిగితే దురుస్తుగా ప్రవర్తించారని, డయల్ 100 సమాచారం అందించినట్లు మోహన్ తెలిపారు. వివరాలు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారన్నారు.

వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం : జగిత్యాల అర్బన్ మండలం.. తిప్పన్నపేటకు చెందిన జక్కుల బాలరాజు ఇంట్లో చొరబడి డోర్స్, వస్తువులను పగులగొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. తిప్పన్నపేటకు చెందిన జక్కుల బాలరాజుకు అదే గ్రామానికి చెందిన తులసికి గురువారం ఇంటి బావి మోటార్ విషయంలో గొడవ జరిగింది. తులసి బాలరాజుపై దాడి చేయడంతో వస్తువులను ధ్వంసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తులసిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

మేడిపెల్లి: భీమారం మండలం.. లింగంపేట్ గ్రామానికి చెందిన రాణవేణి గంగాధర్(45) ఇటీవల గుండెపోటుతో దుబాయిలో మృతిచెందగా శుక్రవారం స్వగ్రామానికి మృతదేహం చేరింది. కుటుంబ సభ్యులు, గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల, రాచర్ల గొల్లపల్లిలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీ చేపట్టారు. మద్యంతాగి వాహనాలు నడిపిన ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. తనిఖీల్లో హెచ్‌సీ రవీందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

జగిత్యాలక్రైం: మండలం నర్సింగాపూర్‌కు చెందిన మానాల అనిత అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్ తెలిపారు. గ్రామానికి చెందిన ఉప్పారపు లక్ష్మీ కుమార్తె అనిత భర్తతో మనస్పర్థలు రావడంతో తల్లిగారింటి వద్ద ఉంటోంది. గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.